PRGI NO TGTEL/26/A2948

జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

# జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక




హైదరాబాద్, విజయవాడ ॥ సంపుటి:1 ॥ సంచిక: 109 ॥ ఆదివారం ॥ 13-9-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



13 సెప్టెంబర్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:07 సూర్యాస్తమయం - సా. 6:16 తిథి విదియ ఉ. 7:09 వరకు తరువాత తదియ సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం హస్త మ. 1:05 వరకు తరువాత చిత్తా యోగం శుక్ల మ. 1:38 వరకు కరణం కౌలవ ఉ. 7:09 వరకు తైతుల రా. 7:07 వరకు వర్జ్యం రా. 9:22 నుండి రా. 11:01 వరకు దుర్ముహూర్తం సా. 4:39 నుండి సా. 5:28 వరకు రాహుకాలం సా. 4:45 నుండి సా. 6:16 వరకు యమగండం మ. 12:12 నుండి మ. 1:43 వరకు గుళికాకాలం మ. 3:14 నుండి సా. 4:45 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:31 నుండి తె. 5:19 వరకు అమృత ఘడియలు ఉ. 7:03 నుండి ఉ. 8:40 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:36 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

# ప్రతిపక్షాలు అహంకారం వీడాలి



## శాసనసభలో ప్రతిపక్షాలపై ముఖ్యమంత్రి రేవంత్ విమర్శలు

## అధికారం పోయినా అహంకారం తగ్గలేదని వ్యాఖ్య

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అధికారం కోల్పోయినప్పటికీ అహంకారం మాత్రం తగ్గలేదంటూ ఆయన విమర్శలు గుప్పించారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య జరిగిన చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "అధికారం పోయింది... కానీ అహంకారం పోలేదు" అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 12: ఇప్పటికైనా అహంకారం వదులుకోవాలని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి రాజకీయంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సి న అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చమత్కార వ్యాఖ్యలు కూడా చేశారు. "మన ఊర్లలో అయితే వేపాకులతో కొడతారు అధ్యక్షా" అంటూ సభలో నవ్వులు పూయించారు. తనదైన శైలిలో చేసిన ఈ వ్యాఖ్యలు సభ్యుల దృష్టిని ఆకర్షించాయి. మరోసారి మాట్లాడుతూ పోలేపల్లి జాతరకు తీసుకెళ్లి కొట్టాలా అని సరదాగా వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితుల్లోనైనా జ్ఞానోదయం కలుగుతుందేమో అంటూ చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు తరువాయి 2 వ పేజీలో..

### ప్రభుత్వ పాఠశాలల్లో 87 వేల మంది పెరుగుదల: సీఎం

- విద్యాశాఖ సంస్కరణల ఫలితమేనన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఒక్క ఏడాదిలో 60 వేల మంది విద్యార్థుల నమోదు పెరిగిందని వెల్లడి
- ప్రభుత్వ బడులపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని వ్యాఖ్య



2



## డిజిటల్ ఆరోగ్య విప్లవానికి శ్రీకారం

### జనవరి 1 నుంచి ఆరోగ్య రికార్డుల పూర్తి డిజిటలీకరణ

### రూ.249 కోట్లతో వైద్య ప్రాజెక్టుల ప్రారంభం

### క్వాంటం బయో వ్యాలీకి జాతీయ ప్రాజెక్టు హోదా కోరిన సీఎం

రాష్ట్రంలో వైద్యారోగ్య రంగాన్ని ఆధునిక సాంకేతికతతో మరింత బలోపేతం చేసి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్ర ప్రజల ఆరోగ్య రికార్డులను పూర్తిస్థాయిలో డిజిటలీకరిస్తున్నామని, ఇది వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీసే గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని తెలిపారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటం బయో వ్యాలీకి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందించాలని కోరారు.

విజయవాడ, సెప్టెంబర్ 12: శనివారం విజయవాడలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాతో కలిసి ముఖ్యమంత్రి పలు వైద్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన క్రిటికల్ కేర్-2 వ పేజీలో..



2

## మరో వారం రోజుల పాటు వర్షాలు

### తెలంగాణలో వర్షాల హెచ్చరిక

### పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక

తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



2

## నిమ్స్‌లో చిన్నారుల గుండె శస్త్రచికిత్సల విజయం

### నిమ్స్ వైద్య బృందాన్ని అభినందించిన రేవంత్ రెడ్డి

### వారం రోజుల ప్రత్యేక శిబిరంలో 19 మంది చిన్నారులకు విజయవంతమైన శస్త్రచికిత్సలు

### రెండు నెలల పసికందుకు క్లిష్ట శస్త్రచికిత్స పూర్తి చేసిన వైద్యులు



## కేరళలోని చారిత్రక ఆలయంలో ప్రత్యేక పూజలు

### చెట్టికులంగర అమ్మవారి దర్శనంలో పవన్

అలప్పుజ, సెప్టెంబర్ 12: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేరళ రాష్ట్రంలోని అలప్పుజ జిల్లా పరిధిలో ఉన్న చారిత్రక చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మవారి ఆలయాన్ని శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం తరువాయి 2 వ పేజీలో..

## ఢిల్లీ చేరుకున్న షీ జిన్‌పింగ్



### 18వ బ్రిక్స్ సదస్సుకు హాజరైన చైనా అధ్యక్షుడు

### విమానాశ్రయంలో స్వాగతం పలికిన జితిన్ ప్రసాదా

### బహుళధ్రువ ప్రపంచ నిర్మాణంపై చర్చలకు ఆసక్తి

18వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ శనివారం న్యూఢిల్లీకి చేరుకున్నారు. ఆయనకు భారత ప్రభుత్వం తరఫున కేంద్ర సహాయ మంత్రి జితిన్ ప్రసాదా ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారత, చైనా ప్రతినిధులు పరస్పరం అభివాదాలు చేసుకుంటూ సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. షీ జిన్‌పింగ్ రాకతో బ్రిక్స్ సమావేశాలపై అంతర్జాతీయ వర్గాల్లో ఆసక్తి మరింత పెరిగింది.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: బ్రిక్స్ సదస్సు సందర్భంగా సభ్య దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య, పెట్టుబడులు, సాంకేతికత, అభివృద్ధి రంగాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల గొంతుకను ప్రపంచ వేదికపై మరింత బలంగా వినిపించే దిశగా సభ్య దేశాలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నాయి. గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలో సమతుల్యత సాధించడంలో బ్రిక్స్ పాత్రను మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పర్యటనకు దౌత్యపరంగా కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. బ్రిక్స్ వేదికపై సభ్య దేశాల మధ్య సహకారాన్ని విస్తరించడంతో పాటు, అంతర్జాతీయతరువాయి 2 వ పేజీలో..

## తాతయ్య-అమ్మమ్మల ప్రేమకు గుర్తింపే గ్రాండ్‌పేరెంట్స్ డే

Grandparents Day



డెస్క్, సెప్టెంబర్ 12 : ప్రతి కుటుంబంలో తాతయ్య, అమ్మమ్మల స్థానం ఎంతో ప్రత్యేకమైనది. వారి ప్రేమ, ఆప్యాయత, అనుభవం, మార్గదర్శకత్వం కుటుంబ వ్యవస్థకు బలమైన పునాదిగా నిలుస్తాయి. ఈ అమూల్యమైన సేవలను గుర్తిస్తూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలలో గ్రాండ్‌పేరెంట్స్ డే ను జరుపుకుంటారు. ఈ రోజు పెద్దల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేయడానికి, వారి త్యాగాలను స్మరించుకోవడానికి, కుటుంబాల్లో వారి పాత్రను గుర్తించడానికి ఒక ప్రత్యేక సందర్భంగా నిలుస్తుంది. తాతయ్యలు, అమ్మమ్మలు కేవలం కుటుంబ పెద్దలు మాత్రమే కాదు, జీవిత పాఠాలను నేర్పే తొలి గురువులు కూడా. వారి అనుభవాలు, జ్ఞానం, సంప్రదాయాలపై అవగాహన కుటుంబ సభ్యులకు మార్గనిర్దేశం చేస్తాయి.

- కుటుంబ వ్యవస్థకు బలమైన ఆధారస్తంభాలు
- విలువలు, సంస్కృతికి వారధులైన పెద్దలు
- తరం నుంచి తరానికి అనుబంధాలను పంచే బంధం

భారతీయ సంస్కృతిలో పెద్దలకు గౌరవం ఇవ్వడం ఒక ముఖ్యమైన సంప్రదాయం. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో తాతయ్యలు, అమ్మమ్మలు కుటుంబానికి కేంద్ర బిందువులుగా ఉండేవారు. కాలక్రమేణా కుటుంబ వ్యవస్థల్లో మార్పులు వచ్చినప్పటికీ వారి ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. (మిగతా 2వ పేజీలో)

# ప్రభుత్వ పాఠశాలల్లో 87 వేల మంది పెరుగుదల: సీఎం

**విద్యాశాఖ సంస్కరణల ఫలితమేనన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఒక్క ఏడాదిలో 60 వేల మంది విద్యార్థుల నమోదు పెరిగిందని వెల్లడి**

**ప్రభుత్వ బడులపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని వ్యాఖ్య**

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి) రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేపట్టిన విద్యా సంస్కరణలు సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తాను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంలో ప్రతి ఏడాది విద్యార్థుల నమోదు తగ్గుముఖం పట్టగా, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిందని చెప్పారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరగడం వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి, 2024–25 మరియు 2025–26 విద్యా సంవత్సరాల్లో కలిపి ప్రభుత్వ పాఠశాలల్లో 87 వేల మంది విద్యార్థులు అదనంగా చేరారని వెల్లడించారు. ముఖ్యంగా విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలు, పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల ఈ పెరుగుదలకు కారణమయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ ఒక్క ఏడాదిలోనే సుమారు 60 వేల మంది విద్యార్థుల నమోదు పెరగడం విద్యాశాఖ పనితీరుకు నిదర్శనమని రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థుల నమోదు ప్రక్రియను సరళీకృతం చేయడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా తల్లిదండ్రుల్లో విశ్వాసం పెరిగిందని చెప్పారు. విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు విద్యాసంస్థల వైపు విద్యార్థుల వలస ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం ఆ ధోరణిలో మార్పు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, మెరుగైన వసతులు, సాంకేతిక సదుపాయాల కల్పనతో విద్యార్థులు తిరిగి ప్రభుత్వ విద్యా వ్యవస్థ వైపు ఆకర్షితులవుతున్నారని అన్నారు. ఇది విద్యా రంగంలో సాధించిన ముఖ్యమైన విజయంగా అభివర్ణించారు. తన పనితీరుపై విమర్శలు చేస్తున్న వారికి అధికారిక గణాంకాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యాశాఖ మంత్రిగా తాను సమర్థవంతంగా పనిచేయడం లేదని ఆరోపిస్తున్న వారు ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యను పరిశీలించాలని అన్నారు. గణాంకాలే వాస్తవాలను చెబుతాయని, ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలను కల్పించేందుకు మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు. విద్యా రంగంలో తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన వెల్లడించారు.

## నేటి రాశి ఫలాలు

**మేషం:** వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఆర్థికంగా మరింత పురోగతి కలుగుతుంది. నూతన కార్యక్రమాలు చేపడతారు. ఉద్యోగమున నూతన అవకాశములు అందుతాయి. దూరపు బంధువుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు.

**వృషభం:** విద్యార్థుల ప్రయత్నాలు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆశించిన మార్పులు ఉంటాయి. వివాదాలకు సంభందించి విలువైన సమాచారం అందుతుంది. దైవదర్శనాలు చేసుకుంటారు. విందువినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. మిత్రులతో అకారణ మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు తప్పవు. ఉద్యోగమున అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ సభ్యుల నుంచి ధనపరమైన ఒత్తిడి తప్పదు. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి.

**కర్కాటకం:** వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. ఇంటాబయట బాధ్యతలు తప్పవు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

**సింహం:** పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. బంధువులతో కీలక వ్యవహారాలలో చర్చలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు మరింత అనుకూలిస్తాయి. విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి.

**కన్య:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. నిరుద్యోగ యత్నాలు సానుకూలమౌతాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యత కలుగుతుంది.

**తుల:** వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆర్థిక సమస్యలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత తప్పదు.

**వృశ్చికం:** చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. బంధువుల మాటలు మానసికంగా బాధిస్తాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు అధికమౌతాయి. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. స్వల్ప ఆరోగ్య సమస్యలు ఉంటాయి.

**ధనస్సు:** కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. నూతన వాహనయోగం ఉన్నది. పాతబాకీలు వసూలవుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

**మకరం:** కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడులు పెరుగుతాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. సంతాన విద్యా, ఉద్యోగయత్నాలు నిదానిస్తాయి. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కుంభం:** ఉద్యోగాలలో అధికారులతో చర్చలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలలో సమస్యలు అధిగమిస్తారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కష్ట సుఖాలు పంచుకుంటారు. బంధు వర్గం నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**మీనం:** దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారమున భాగస్వాములతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు తప్పవు. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ముఖ్యమైన పనులలో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. కొన్ని పనులలో శ్రమ పడినా ఫలితం ఉండదు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.



## కేరళలోని చారిత్రక ఆలయంలో ప్రత్యేక పూజలు

మొదటి పేజీ తరువాయి

ఆలయ ఆచారాలను అనుసరిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పుష్పాంజలి సేవలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన శ్రీ భగవతి అమ్మవారికి పుష్పాంజలి సమర్పణ సర్వదోష నివారణకు దోహదపడుతుందని భక్తుల విశ్వాసం. ఆలయ ప్రధాన అర్చకులు ఉప ముఖ్యమంత్రికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు అందజేశారు.

అమ్మవారి దర్శనానికి ముందు ఆలయ సంప్రదాయం ప్రకారం బాలశివుని దర్శించుకుని అర్చనలు చేసిన పవన్ కళ్యాణ్, అనంతరం ప్రధాన గర్భగుడిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడు, నాగదేవతలకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మేల్ శాంతి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి అయ్యే వ్యయాన్ని దేవస్థానం బోర్డుకు పవన్ కళ్యాణ్ విరాళంగా అందజేశారు. భక్తులకు ఉచిత భోజన సదుపాయాలు కల్పించేందుకు తన వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

త్రిశక్తి స్వరూపిణిగా భక్తుల పూజలు అందుకుంటున్న చెట్టికులంగర శ్రీ భగవతి అమ్మవారి ఆలయానికి 1200 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని చెబుతారు. పురాణాల ప్రకారం రాక్షస సంహారం కోసం శివుడి మూడో కన్ను నుంచి అమ్మవారు అవతరించారని విశ్వసిస్తారు. దసరా నవరాత్రుల సమయంలో ఈ ఆలయానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. పవన్ కళ్యాణ్ ఆలయ దర్శనం సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక భద్రతా ఏర్పాట్ల మధ్య పూజా కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. ఉప ముఖ్యమంత్రి చేసిన అన్నదాన విరాళంపై ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతిపక్షాలు అహంకారం వీడాలి

మొదటి పేజీ తరువాయి

తెప్పించాయి. ఈ వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సభలో జరిగిన చర్చల సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సభలో ప్రధాన చర్చగా మారాయి. రాజకీయ పరిణామాలు, ప్రజల తీర్పుపై కూడా ఆయన ప్రస్తావించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. అధికార పక్షం వాటిని సమర్థిస్తుండగా, ప్రతిపక్షాలు తమదైన రీతిలో స్పందిస్తున్నాయి. శాసనసభ సమావేశాల్లో చోటుచేసుకున్న ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.

## తాతయ్య-అమ్మమ్మల ప్రేమకు గుర్తింపే గ్రాండ్‌పేరెంట్స్ డే

(మొదటి పేజీ తరువాయి)

పిల్లల పెంపకం నుంచి కుటుంబ నిర్ణయాల వరకు అనేక అంశాల్లో వారు కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నారు. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను బలపరచడంలో కూడా వారి పాత్ర విశేషంగా ఉంటుంది. నేటి వేగవంతమైన జీవితంలో ఉద్యోగాలు, చదువులు, నగరీకరణ కారణంగా కుటుంబ సభ్యులు పెద్దలతో గడిపే సమయం తగ్గుతోంది. ఈ పరిస్థితుల్లో కొంతమంది వృద్ధులు ఒంటరితనాన్ని ఎదుర్కొంటున్నారు. గ్రాండ్‌పేరెంట్స్ డే వంటి సందర్భాలు వారి పట్ల ప్రేమ, గౌరవం, శ్రద్ధను వ్యక్తం చేయడానికి మంచి అవకాశాన్ని కల్పిస్తాయి. కుటుంబ సభ్యులు వారితో సమయం గడపడం, వారి అనుభవాలను వినడం, వారి అవసరాలను గుర్తించడం వంటి చర్యలు పెద్దల్లో ఆనందాన్ని నింపుతాయి. సమాజ నిర్మాణంలో కూడా వృద్ధుల పాత్ర ఎంతో కీలకమైనది. వారు జీవితంలో ఎదుర్కొన్న అనుభవాలను తదుపరి తరాలకు అందిస్తారు. కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, విలువలను ఎలా కాపాడుకోవాలి, కుటుంబ బంధాలను ఎలా నిలబెట్టుకోవాలి అనే విషయాల్లో వారు మార్గదర్శకులుగా నిలుస్తారు. యువతకు స్ఫూర్తినిచ్చే అనేక జీవిత పాఠాలు వారి అనుభవాల్లో దాగి ఉంటాయి. అందువల్ల వారి జ్ఞానాన్ని సమాజం సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది. పెద్దల ఆరోగ్యం, సంక్షేమం కూడా సమాజం దృష్టి సారించాల్సిన ముఖ్యమైన అంశం. వయసు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక ఒంటరితనం వంటి సవాళ్లు ఎదురవుతుంటాయి. ఈ పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల మద్దతు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక సంస్థల సహకారం అవసరం. వృద్ధులు గౌరవప్రదమైన జీవితం గడపడానికి అనుకూల వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలి. డిజిటల్ యుగంలో కూడా తాతయ్యలు, అమ్మమ్మలు కొత్త మార్పులకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటున్నారు.

## డిజిటల్ ఆరోగ్య విప్లవానికి శ్రీకారం

మొదటి పేజీ తరువాయి

బ్లాక్, సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాలలను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.249 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 10 క్రిటికల్ కేర్ బ్లాకులు, 12 సమీకృత ప్రజారోగ్య ప్రయోగశాలలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 500 క్రిటికల్ కేర్ పడకలు అందుబాటులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. అత్యాధునిక శస్త్రచికిత్స గదులు, గుండె, మూత్రపిండాలు, నాడీ సంబంధిత వ్యాధుల చికిత్స సేవలు, అల్ట్రాసౌండ్ వంటి ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు మరింత చేరువ అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆరోగ్య, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీ చేరుకున్న షీ జిన్‌పింగ్

మొదటి పేజీ తరువాయి

రాజకీయాలు, ఆర్థిక సవాళ్లు, భద్రతా అంశాలపై అభిప్రాయాల మార్పిడి జరగనుంది. సభ్య దేశాల మధ్య పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త సహకార అవకాశాలను అన్వేషించే ప్రయత్నాలు కూడా కొనసాగనున్నాయి. భారత్ విదేశాంగ శాఖ షీ జిన్‌పింగ్‌కు స్వాగతం పలుకుతూ విడుదల చేసిన సందేశంలో బ్రిక్స్ సహకారం ప్రపంచ స్థిరత్వానికి, అభివృద్ధికి కీలకమని పేర్కొంది.

## నిమ్స్‌లో చిన్నారుల గుండె శస్త్రచికిత్సల విజయం

**నిమ్స్ వైద్య బృందాన్ని అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్**

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): నిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ శిబిరం విజయవంతంగా పూర్తికావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారుల గుండె శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిమ్స్‌లో ప్రత్యేక పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ శిబిరాన్ని నిర్వహించారు. పుట్టుకతో గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న 19 మంది చిన్నారులకు ఈ శిబిరంలో విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఆధునిక వైద్య సదుపాయాలు, నిపుణుల సేవలతో చిన్నారులకు మెరుగైన చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. ప్రత్యేకంగా కేవలం రెండు నెలల వయస్సు, రెండు కిలోల బరువు ఉన్న పసికందుకు అత్యంత క్లిష్టమైన గుండె శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేయడం విశేషమని వైద్యులు వివరించారు. ఈ విజయంతో చిన్నారుల గుండె వైద్య సేవల రంగంలో నిమ్స్ మరో మైలురాయిని చేరుకుందని పేర్కొన్నారు. వైద్యులు డి. రమణ ధన్వపునేని, ఎం. అమరేష్ రావు ముఖ్యమంత్రిని కలిసి శిబిరం వివరాలను తెలియజేశారు. చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు అంకితభావంతో పనిచేసిన వైద్య బృందం సేవలను ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రభుత్వం వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తోందని, అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# మరో వారం రోజుల పాటు వర్షాలు

**తెలంగాణలో వర్షాల హెచ్చరిక**

**పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక**

**సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచన**

తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్, సెప్టెంబర్ 12: వర్షాల ప్రభావంతో నదులు, వాగులు, చెరువుల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అటవీ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంట పొలాల్లో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కూడా రైతులకు సూచనలు జారీ చేసింది. ఇక నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో కూడా మోస్తరు వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నందున అవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రజారోగ్య శాఖ ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ముఖ్యంగా దోమల ద్వారా, కలుషిత నీటి ద్వారా, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. పిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. దోమ తెరలు వినియోగించడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం తప్పనిసరిగా పాటించాలని ఆరోగ్య శాఖ కోరింది.

# శ్వేత

## సంపాదకీయం

**ఆదివారం 13-9-2026**

## ఆదివారం... సెలవు మాత్రమే కాదు, సాధించిన హక్కు

వారమంతా ఎదురు చూసే రోజు ఏదైనా ఉందంటే అది ఆదివారమే. ఉదయం ఆలస్యంగా నిద్రలేవడం, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేయడం, స్నేహితులను కలవడం, చిన్న చిన్న విహారయాత్రలు, పిల్లలతో సరదాగా గడపడం, పుస్తకాలు చదవడం, ఇష్టమైన పనులు చేసుకోవడం... ఇలా ప్రతి ఒక్కరికీ ఆదివారం అంటే ప్రత్యేకమైన అనుభూతి. కానీ మనం ఎంతో సహజంగా భావించే ఈ ఒక్క రోజు సెలవు వెనుక ఒక సుదీర్ఘ చరిత్ర, వేలాది మంది కార్మికుల పోరాటం, సామాజిక మార్పు కోసం సాగిన ఉద్యమం దాగి ఉందని చాలా మందికి తెలియదు. నేడు మనం ఆస్వాదిస్తున్న ఆదివారం విశ్రాంతి ఒకప్పుడు సాధారణ ప్రజలకు అందని అవకాశంగా ఉండేది.

ఆదివారం సెలవు సంప్రదాయానికి ప్రపంచ చరిత్రలో చాలా పాత మూలాలు ఉన్నాయి. క్రీస్తుశకం 321లో రోమన్ చక్రవర్తి కాన్స్టాంటైన్ ఆదివారాన్ని అధికారిక విశ్రాంతి దినంగా ప్రకటించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. క్రైస్తవ మత సంప్రదాయంలో ఆదివారం ప్రార్థనలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రత్యేకమైన రోజుగా భావించబడేది. కాలక్రమేణా ఈ విధానం యూరప్ దేశాలకు విస్తరించింది. తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యం తన పాలనతో పాటు ఈ వారాంత విశ్రాంతి విధానాన్ని కూడా ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు తీసుకెళ్లింది. భారత్‌లోనూ ఆదివారం సెలవు భావన బ్రిటిష్ పాలనా వ్యవస్థ ద్వారానే ప్రవేశించింది.

అయితే బ్రిటిషలు భారత్‌కు వచ్చిన వెంటనే అందరికీ ఆదివారం సెలవు లభించలేదు. ప్రభుత్వ అధికారులు, బ్రిటిష్ ఉద్యోగులకు మాత్రమే విశ్రాంతి ఉండేది. మరోవైపు భారతీయ కార్మికులు వారానికి ఏడు రోజులూ నిరంతరంగా పనిచేయాల్సి వచ్చేది. ముఖ్యంగా బొంబాయి వస్త్ర మిల్లుల్లో పనిచేసే కార్మికుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేది. రోజుకు 12 గంటలకు పైగా పని, సరైన భోజన విరామం లేకపోవడం, విశ్రాంతి లేకపోవడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతింటోంది. కుటుంబంతో గడిపే సమయం కూడా వారికి దొరకేది కాదు. కార్మికులను యంత్రాల్లా పని చేయించేవారు. ఈ పరిస్థితి క్రమంగా అసంతృప్తికి దారితీసింది.

ఈ అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పిన వ్యక్తి నారాయణ్ మేఘాజీ లోఖండే. భారత కార్మిక ఉద్యమ పితామహుడిగా గుర్తింపు పొందిన ఆయన, కార్మికుల హక్కుల కోసం ఉద్యమాన్ని ప్రారంభించారు. 1880లలో బాంబే మిల్ హ్యాండ్స్ అసోసియేషన్‌ను స్థాపించి వారానికి ఒకరోజు సెలవు, పని గంటల నియంత్రణ, భోజన విరామం, సమయానికి వేతనాల చెల్లింపు వంటి డిమాండ్లతో బ్రిటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. వేలాది మంది కార్మికులను ఏకం చేసి సమావేశాలు, వినతిపత్రాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికుల విశ్రాంతి కూడా ఒక హక్కేనని ఆయన బలంగా వాదించారు.

దాదాపు ఏడు సంవత్సరాల పాటు సాగిన ఈ పోరాటం చివరకు ఫలించింది. 1890 జూన్ 10న భారత కార్మికులకు ఆదివారాన్ని అధికారిక వారాంత సెలవుగా ప్రకటించారు. ఇది కేవలం ఒకరోజు సెలవు మాత్రమే కాదు, భారత కార్మిక ఉద్యమ చరిత్రలో గొప్ప విజయంగా నిలిచింది. అనంతరం ఈ విధానం క్రమంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పోస్టాఫీసులు, రైల్వేలు, ప్రైవేట్ సంస్థలకు విస్తరించింది. నేడు మనం సహజంగా అనుభవిస్తున్న వారాంత విశ్రాంతి వెనుక ఉన్న అసలు కథ ఇదే.

ఆదివారాన్నే సెలవు దినంగా ఎంచుకోవడానికి కూడా కొన్ని కారణాలు ఉన్నాయి. బ్రిటిష్ పాలకులకు అది ప్రార్థన దినం. అదే సమయంలో భారతీయ సంప్రదాయంలో కూడా ఆదివారం సూర్యభగవానునికి అంకితమైన పవిత్ర దినంగా పరిగణించబడేది. రెండు వర్గాల ఆచారాలకు అనుగుణంగా ఉండటంతో ఆదివారాన్నే వారాంత విశ్రాంతి దినంగా నిర్ణయించారు. తర్వాత ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత విస్తృతంగా పాటించే సెలవు విధానంగా మారింది.

కాలం మారిన కొద్దీ ఆదివారం అర్థం కూడా మారింది. ఒకప్పుడు అది కేవలం శ్రమ నుంచి ఉపశమనం కోసం దక్కిన రోజు. ఇప్పుడు అది కుటుంబ అనుబంధాలకు, వ్యక్తిగత అభిరుచులకు, సామాజిక సంబంధాలకు వేదికగా మారింది. పిల్లలకు ఆటల రోజు, విద్యార్థులకు ఉపశమన దినం, ఉద్యోగులకు విశ్రాంతి సమయం, పెద్దలకు కుటుంబంతో గడిపే అవకాశం. జీవితంలో కోల్పోతున్న అనుబంధాలను తిరిగి గుర్తు చేసే రోజు కూడా ఆదివారమే. అందుకే చాలామందికి ఆదివారం ఒక భావోద్వేగం, ఒక అనుభూతి.

అయితే ఆధునిక కాలంలో ఆదివారం అసలు ఉద్దేశం కొంతమేర మారిపోతోంది. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్, వర్క్ ఫ్రం హోమ్ విధానాల కారణంగా చాలామంది సెలవు రోజున కూడా పని ఒత్తిడిలోనే ఉంటున్నారు. విశ్రాంతి కోసం ఉద్దేశించిన రోజును కూడా ఇమెయిల్స్, మీటింగ్‌లు, ఆన్‌లైన్ పనులు ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా శారీరకంగా, మానసికంగా పునరుత్తేజం పొందాల్సిన అవకాశం తగ్గిపోతోంది. అందువల్ల ఆదివారం విలువను మళ్లీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

వాస్తవానికి ఆదివారం మనిషి జీవితానికి సమతుల్యతను అందించే రోజు. పని ఎంత ముఖ్యమో విశ్రాంతి కూడా అంతే ముఖ్యమని గుర్తు చేసే రోజు. కుటుంబం కోసం, మనసు కోసం, ఆరోగ్యం కోసం, ఆనందం కోసం కేటాయించిన రోజు. మనం చేసే పనికి అర్థం రావాలంటే జీవితం కూడా ఉండాలని, జీవితం ఉండాలంటే విశ్రాంతి అవసరమని చెప్పే రోజు.

అందుకే ఆదివారం కేవలం క్యాలెండర్‌లోని ఒక రోజు కాదు. అది కార్మికుల పోరాటానికి గుర్తు. మనిషి గౌరవానికి ప్రతీక. కుటుంబ సంతోషాలకు చిరునామా. వారమంతా అలసిపోయిన మనసుకు కొత్త శక్తిని ఇచ్చే పునరుజ్జీవన దినం. నేడు ఆదివారం హాయిగా గడుపుతున్న ప్రతి ఒక్కరూ, ఆ ఒక్కరోజు విశ్రాంతి కోసం పోరాడిన వేలాది మంది కార్మికులను, నారాయణ్ మేఘాజీ లోఖండే వంటి ఉద్యమకారులను ఒకసారి స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే మనం ఆనందంగా గడిపే ఈ ఆదివారం... ఎవరో సాధించి పెట్టిన హక్కు.




## ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

ఉప్పల్, సెప్టెంబర్ 12: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ లక్ష్యం గా ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినా యక విగ్రహాల పంపిణీ శనివారం జరిగింది . ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావ రణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడ వచ్చున్నారు. సంప్రదాయా న్ని కాపాడుతూ ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. యువత, మహిళలు, గణేష్ ఉత్సవ కమిటీలు, కాలనీ సంక్షేమ సంఘాలు పర్యావరణహిత గణేష్ ఉత్సవాల్లో భాగస్వాము లు కావాలని సూచించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకటరామిరెడ్డి, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి.తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సాగర్, ఉపాధ్యక్షులు ఏవి.శ్రీధర్‌రావు, కే.నరోత్తమరెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్ జాయింట్ సెక్రటరీ డి.రాజు, సీనియర్ జర్నలిస్టులు కొలనుపాక చంద్రమౌళి, పి.మహేందర్‌రెడ్డి, మండల శ్రీశైలం తదితర జర్నలిస్టులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## యూఏఈ అధ్యక్షుడితో మోదీ భేటీ

**భారత్-యూఏఈ వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు**

**రక్షణ, ఏఐ, అంతరిక్ష రంగాల్లో సహకార విస్తరణకు ప్రాధాన్యం**

**ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి భాగస్వామ్యం కీలకమని వ్యాఖ్య**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో సమావేశమై ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చించారు. భారత్-యూఏఈ సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలపై ఇరు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించడంపై సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించారు. రక్షణ రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, భద్రతా అంశాల్లో సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై ఇరు నాయకులు చర్చించారు. ప్రాంతీయ భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పరస్పర సహకారం మరింత అవసరమని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, భాగస్వామ్య కార్యక్రమాల విస్తరణపై కూడా సమాలోచనలు జరిగాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ), అంతరిక్ష పరిశోధన, కీలక ఖనిజాల రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించే అవకాశాలను కూడా పరిశీలించారు. భవిష్యత్ సాంకేతికతల అభివృద్ధిలో ఇరు దేశాలు కలిసి పనిచేసే అవకాశాలపై చర్చించారు. అధునాతన సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు, పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించే దిశగా సహకారాన్ని పెంచాలని నిర్ణయించారు. ఇంధన భద్రత, ఆహార భద్రత రంగాల్లో పరస్పర సహకారం మరింత బలోపేతం కావాల్సిన అవసరాన్ని ఇరు నేతలు గుర్తించారు. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక పరిణామాల నేపథ్యంలో స్థిరమైన సరఫరా వ్యవస్థలు, దీర్ఘకాలిక భాగస్వామ్యాల ప్రాధాన్యంపై చర్చించారు. ఇంధన రంగంలో ఉన్న బలమైన సంబంధాలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు. కనెక్టివిటీ, వాణిజ్య భాగస్వామ్యం, పెట్టుబడుల విస్తరణపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. భారత్ మరియు యూఏఈ మధ్య పెరుగుతున్న ఆర్థిక సంబంధాలు ఇరు దేశాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని నేతలు పేర్కొన్నారు. ప్రజల మధ్య సంబంధాలు, వ్యాపార అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ బలమైన భారత్-యూఏఈ భాగస్వామ్యం ప్రాంతీయ స్థిరత్వం, శాంతి, సుసంపన్నతకు ముఖ్యంగా దోహదపడుతోందని పేర్కొన్నారు. పరస్పర విశ్వాసం, సహకారం ఆధారంగా ఇరు దేశాల సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని తెలిపారు.





## ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సత్య ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక

**యువ మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా స్వప్న**

**ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సల్మాన్ బేగ్**

**మేడ్చల్ జిల్లాకు రాష్ట్ర సమితి లో దక్కిన ప్రధాన్యత**

ఉప్పల్, సెప్టెంబర్ 12 (స్టార్ న్యూస్): యాదగిరిగుట్టలో సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో ఇటీవల జరిగిన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలం మల్లాపూర్‌కు చెందిన కామ్రేడ్ సత్య ప్రసాద్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల ఏఐఎస్ఎఫ్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. విద్యార్థి ఉద్యమంతో ప్రారంభమైన ఆయన ప్రస్థానం రెండు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాల మధ్య కొనసాగుతూ నేడు రాష్ట్ర స్థాయి బాధ్యతలకు చేరుకోవడం యువతలో నూతన ఉత్సాహాన్ని నింపుతోంది. 2004లో ఏఐఎస్ఎఫ్ కాప్రా మండల కార్యదర్శిగా ఎన్నికై విద్యార్థి సమస్యలపై పోరాటం ప్రారంభించిన సత్య ప్రసాద్, అనంతరం 2010లో ఏఐఎస్ ఎఫ్ ఉమ్మడి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థి ఉద్యమంలో తన అనుభవాన్ని యువజన ఉద్యమంలోకి తీసుకెళ్లి 2017లో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా, 2020లో మరోసారి జిల్లా అధ్యక్షుడిగా, 2023లో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ యువత సమస్యలపై నిరంతరం ఉద్యమించారు. ఈ దీర్ఘకాలిక ఉద్యమ ప్రస్థానానికి గుర్తింపుగా రాష్ట్ర మహాసభలు ఆయనను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకోవడం గర్వకారణమని ఏఐవైఎఫ్ నాయకులు పేర్కొన్నారు.విద్యార్థి హక్కు కోసం పోరాడటం నుంచి నిరుద్యోగ యువత ఉపాధి హక్కు కోసం ఉద్యమించడం వరకు సత్య ప్రసాద్ ప్రస్థానం కొనసాగింది. ఫీజుల భారంతో విద్యకు దూరమవుతున్న విద్యార్థులు, స్కాలర్‌షిప్‌లు--ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్న యువత, నోటిఫికేషన్ల కోసం సంవత్సరాల తరబడి నిరీక్షిస్తున్న నిరుద్యోగులు, పేపర్ లీకేజీలతో నష్టపోతున్న అభ్యర్థులు, కాంట్రాక్టు--ఔట్‌సోర్సింగ్ విధానాలతో భవిష్యత్తు కోల్పోతున్న యువత సమస్యలపై సంఘటిత పోరాటమే పరిష్కారం అనే కమ్యూనిస్టు సిద్ధాంతంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఏఐవైఎఫ్ భావిస్తోంది. విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు, కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా యువతను సమీకరించి ఉపాధి హక్కు, ఉచిత--నాణ్యమైన విద్య, సామాజిక న్యాయం, ప్రజా రంగ పరిరక్షణ కోసం పోరాటాలను మరింత విస్తరించాల్సిన బాధ్యత కొత్త రాష్ట్ర కమిటీపై ఉందని పేర్కొన్నారు. అదే విధంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సల్మాన్ బేగ్, రాష్ట్ర సమితి సభ్యులుగా రాజ్ కుమార్, శేఖర్, కీర్తి బాబు, సతీష్ కుమార్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.





# పనితీరే ప్రామాణికం.. గెలుపే లక్ష్యం

**పంచుమర్తి అనురాధ**

**స్థానిక ఎన్నికల్లో కూటమి జెండా ఎగరాలి - ఎమ్మెల్యే రోషన్ కుమార్**

**ఆర్కే ఫంక్షన్ హాల్‌లో టీడీపీ భేటీ**

చింతలపూడి, సెప్టెంబర్ 12 : చింతలపూడి పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్ లో శనివారం చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏలూరు జిల్లా ఎన్నికల అబ్జర్వర్ పసుమర్తి అనురాధ హాజరయ్యారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చింతలపూడి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూటమి అభ్యర్థులను 100 శాతం గెలిపించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. అభ్యర్థుల ఎంపికలో పనితీరు, పార్టీకి చేసిన సేవలే ప్రామాణికమని స్పష్టం చేశారు. రిజర్వేషన్లు ఖరారైన వెంటనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. అత్య రాజకీయాలకు అడ్రస్ గా మారిన వైసీపీ కొన్ని అరాచక శక్తులను వెంటబెట్టుకుని తప్పుడు ప్రసారాలు చేస్తోందని, డీఎస్సీ ఉపాధ్యాయులను కూడా కించపరిచే విధంగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రతి టీడీపీ కార్యకర్త, నాయకుడు వైసీపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టేలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ 2029 సార్వత్రిక ఎన్నికలకు ఈ స్థానిక ఎన్నికలే పునాది అని అన్నారు. కూటమి పార్టీల మధ్య సమన్వయంతో, విభేదాలను పక్కనపెట్టి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రూపు రాజకీయాలకు ముగింపు పలకాలని, అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు మనం నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరికి తెలిసేలా పనిచేయాలని సూచించారు. ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు బడేటి రాధా కృష్ణయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కూటమికి అనుకూలమైన వాతావరణం ఉ ందని, ముఖ్యంగా చింతలపూడి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోనూ కూటమి జెండా ఎగరడం ఖాయమన్నారు. ప్రతి బూత్ నుంచి పార్టీని బలోపేతం చేయాలని, బూత్ కమిటీలను పటిష్టం చేస్తే విజయం మనదేనని అన్నారు. రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ...గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన సహకార వ్యవస్థను కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలో పెడుతోందని, రైతులకు అండగా నిలబడుతోందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రైతులు, సహకార సంఘాల సభ్యులంతా కూటమికే అండగా నిలవాలని కోరారు.

నియోజకవర్గ పరిశీలకులు రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కూటమి బలంగా ఉందని, అభ్యర్థుల ఎంపికలో కూటమి నేతలందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఈ అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని, అలాంటి ప్రచారాన్ని కార్యకర్తలు దీటుగా తిప్పికొట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే మురళి మాట్లాడుతూ... ఈ స్థానిక ఎన్నికలు నియోజకవర్గ భవిష్యత్తును నిర్ణయిస్తాయని, అనుభవజ్ఞులైన నాయకులు, యువత సమన్వయంతో పనిచేసి కూటమి విజయానికి కృషి చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గవరపు ముత్తారెడ్డి మాట్లాడుతూ. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ యంత్రాంగం సిద్ధంగా ఉందని, నాలుగు మండలాల్లో ఏకగ్రీవాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ముందుగా ఈ కార్యక్రమంలో హాజరైన వారందరూ వారి యొక్క పేర్లు రిజిస్టర్ చేసుకుని లోపలికి రావడం జరిగింది, కార్యక్రమం ఆద్యంతం చాలా క్రమశిక్షణ గా జరిగింది,

ఈ కార్యక్రమంలో మండల మరియు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు

- గ్రామ పార్టీ అధ్యక్షులు
- క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు
- కన్వీనర్లు, కో-కన్వీనర్లు
- అనుబంధ కమిటీ సభ్యులు
- మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు
- తెలుగుదేశం పార్టీ మాజీ సర్పంచులు
- తెలుగుదేశం పార్టీలో గౌరవ పదవులు పొందిన వారందరూ
- నీటి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు
- అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు
- దేవాలయాల కమిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు మరియు డైరెక్టర్లు
- ఇతర గౌరవ పదవులు పొందిన వారందరూ
- నామినేటెడ్ పదవులు పొందిన వారు అందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పెన్షన్ల దరఖాస్తు గడువు తేదీ పెంచాలి సిపిఐ డిమాండ్

కామవరపుకోట, సెప్టెంబర్ 11, (కింగ్ ఏలూరు జిల్లా ప్రతినిధి),

కూటమి ప్రభుత్వం చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల దరఖాస్తు గడువు తేదీని పెంచాలని కామవరపుకోట సిపిఐ నాయకులు టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో దరఖాస్తుదారులు సచివాలయానికి వెళ్లి వెనక్కి వస్తున్నారని, ఈ నెలాఖరు వరకు కూడా గడువు పెంచాలని సిపిఐ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు ఆదివారం పండగ రూపంలో రెండు రోజులు వృధా అయ్యాయని ఈ నెలాఖరు వరకు పెంచాలన్నారు. దీంతోపాటు సచివాలయ ఉద్యోగులు ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ అంటూ సచివాలయం వద్ద ఉండటం లేదని, డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయాల్లో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కూడా పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే ఎన్నికల హామీలలో భాగంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వాగ్దానాలను అమలు పరచాలన్నారు. అలాగే పెన్షన్ల దరఖాస్తు కోసం కుల ధ్రువీకరణ పత్రం అడుగుతున్నారని, వయసు మాత్రమే పరిగణలోకి తీసుకుని పెన్షన్ అందజేయడానికి అర్హతే ప్రామాణికంగా అందించాలన్నారు. ప్రభుత్వంలో భాగస్వాములైన అంగన్వాడి ఆశ వర్కర్లకు సైతం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పెన్షన్ పొందే అర్హత లేదని అనటం విడ్డూరంగా ఉందన్నారు. పదివేల రూపాయల ఉ ద్యోగస్తులు సైతం ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తూ ప్రభుత్వ పథకాలు అందకుండా చేయటం దారుణం అన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా 50 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ఒక్కరికి కూడా పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, గుద్దేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక భావనలతో చవితి నిర్వహించుకోవాలి: సిఐ సుభాష్

**ఏలూరు జిల్లా, కామవరపుకోట మండలం, సెప్టెంబర్ 12, (కింగ్ న్యూస్ ప్రతినిధి):** ఆధ్యాత్మిక భావనలతో వినాయక చవితి నిర్వహించుకోవాలనీ జంగారెడ్డిగూడెం సిఐ సుభాష్ సూచించారు. శనివారం సాయంత్రం కామవరపుకోట మండలం తడికలపూడి శివాలయం వద్ద జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలపై అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుభాష్ మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాట్లు, నిమజ్జనం, కార్యక్రమాలు వివరాలను ఆన్లైన్లో పొందుపరచడంతో పాటు పోలీసువారికి సమాచారం అందించాలన్నారు. శాంతియుతంగా ఎటువంటి గొడవలు లేకుండా ఉ త్సవాలను ఆధ్యాత్మిక భావనలతో జరుపుకోవాలని సూచించారు. ఎస్సై వల్లి పద్మ ఉత్సవ నిర్వహకులు పాల్గొన్నారు



## చంద్రబాబుతో బీజేపీ నేతల భేటీ

అమరావతి, సెప్టెంబరు 12: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ శనివారం కలిశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పురస్కరించు కుని నిర్వహిస్తున్న 'సేవా--సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో వారు చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత చేరువగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపైనా చర్చించారు.

# జాతీయ లోక్ అదాలత్: 1,60,107 కేసుల పరిష్కారం




**అమీర్ హుస్సేన్... క్రైమ్ బ్యూరో చీఫ్**

హైదరాబాద్: హైదరాబాద్‌లోని నాంపల్లి సెషన్స్ డివిజన్ మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో, సంబంధిత పక్షాల మధ్య పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులు పరిష్కరించబడ్డాయి.

జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మొత్తం 1,60,107 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇంత పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావడం వల్ల అనేకమందికి సత్వర న్యాయం లభించడమే కాకుండా, సుదీర్ఘ న్యాయ ప్రక్రియలకు సంబంధించిన సమయం మరియు ఖర్చులు కూడా ఆదా అయ్యాయి. గౌరవనీయులైన ఇన్‌ఛార్జ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎం.ఎస్.ఎం. అర్చన కుమారి ముఖ్య అతిథిగా హాజరై, సంబంధిత వ్యక్తులకు పరిష్కార ఉ త్తర్వులను (అవార్డులను) అందజేశారు.

రాజీకి అనువైన పెండింగ్ కేసులను గుర్తించడం, సంబంధిత పక్షాలతో చర్చలు జరపడం మరియు పరస్పర అంగీకారం ఆధారంగా పరిష్కారాలను సులభతరం చేయడంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు మరియు సంబంధిత అధికారులు ఎంతో కృషి చేశారు.

లోక్ అదాలత్ ప్రక్రియ కేసుల సత్వర పరిష్కారానికి దోహదపడిందని, దీనివల్ల ప్రజలకు సమయం మరియు న్యాయపరమైన ఖర్చులు ఆదా అవ్వడమే కాకుండా, వివాదాలు స్నేహపూర్వకంగా పరిష్కరించబడ్డాయని అధికారులు పేర్కొన్నారు.

సమాజంలోని పేద మరియు బలహీన వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులకు న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని వారు తెలిపారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిష్కరించబడిన కేసులకు సంబంధించిన ఉత్తర్వులను సంబంధిత వ్యక్తులకు అందజేశారు. తమ కేసులు త్వరగా పరిష్కారం కావడం పట్ల లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గౌరవనీయులైన ఇన్‌ఛార్జ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎం.ఎస్.ఎం. అర్చన కుమారి మాట్లాడుతూ, లోక్ అదాలత్ స్నేహపూర్వక వాతావరణంలో కేసుల సత్వర పరిష్కారానికి వీలు కల్పిస్తుందని, తద్వారా సంబంధిత పక్షాలకు సమయం మరియు డబ్బు ఆదా అవుతాయని పేర్కొన్నారు. పరస్పర అంగీకారం ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు.

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (నాంపల్లి సెషన్స్ డివిజన్) కార్యదర్శి శ్రీమతి ఈ. శ్రీదేవి ఈ సమావేశానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఆమె లోక్ అదాలత్ ప్రాముఖ్యతను మరియు ప్రజలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలను వివరించారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం మరియు డబ్బు ఆదా అవ్వడమే కాకుండా, రెండు పక్షాలకు సంతృప్తికరమైన ఫలితం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన వ్యక్తులు ఉ చిత న్యాయ సహాయ సేవలను వినియోగించుకోవాలని కూడా ఆమె ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో శ్రీ జె. విక్రమ్ (4వ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి), శ్రీ ఎం. శ్రీనివాస్ (అదనపు పోలీస్ కమిషనర్, హైదరాబాద్), శ్రీ ఇ. రామ్ రెడ్డి (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, హైదరాబాద్), శ్రీ ఆర్. బలరాజ్ గౌడ్ (అధ్యక్షులు, వీజజదీ నాంపల్లి) మరియు శ్రీమతి ఇ. శ్రీదేవి (కార్యదర్శి, జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, సెషన్స్ విభాగం నాంపల్లి, హైదరాబాద్) పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కారానికి అవార్డుల పంపిణీ

అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

హైదరాబాద్: జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) మరియు నాంపల్లి, హైదరాబాద్ సెషన్స్ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో, సంబంధిత పక్షాల మధ్య పరస్పర అంగీకారంతో వివిధ రకాల కేసులు పరిష్కరించబడ్డాయి.

గౌరవనీయ ఇన్‌చార్జ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎం.ఎస్.ఎం. అర్చన కుమారి గారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేసులు పరిష్కరించబడిన సంబంధిత వాదులకు ఆమె లోక్ అదాలత్ అవార్డులను (పరిష్కార ఉత్తర్వులను) పంపిణీ చేశారు.

జాతీయ లోక్ అదాలత్ సన్నాహకంలో భాగంగా, న్యాయమూర్తులు, న్యాయవాదులు మరియు అధికారులు సామరస్యపూర్వక పరిష్కారానికి అనువైన పెండింగ్ కేసులను గుర్తించడానికి, వాదులతో చర్చలు జరపడానికి మరియు పరస్పర అంగీకారం ఆధారంగా పరిష్కారాలను సులభతరం చేయడానికి శ్రద్ధగా పనిచేశారు.

లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించడం వల్ల వ్యాజ్యదారులకు సమయం, న్యాయపరమైన ఖర్చులు ఆదా అవ్వడమే కాకుండా, ఇరుపక్షాల మధ్య వివాదాలకు సామరస్యపూర్వక పరిష్కారం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

సమాజంలోని పేద, బలహీన వర్గాలకు చెందిన అర్హులైన వ్యక్తులకు జిల్లా న్యాయ సేవల అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని వారు నొక్కిచెప్పారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఆ అథారిటీని సంప్రదించాలని ప్రజలను కోరారు.



పరిష్కరించబడిన కేసులకు సంబంధించిన లోక్ అదాలత్ అవార్డులను ఆయా వ్యాజ్యదారులకు అందజేశారు. తమ కేసులు వేగంగా పరిష్కారం కావడం పట్ల అవార్డు గ్రహీతలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌరవనీయ ఇన్‌చార్జ్ సెషన్స్ జడ్జి శ్రీమతి ఎం.ఎస్.ఎం. అర్చన కుమారి మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరగా, సామరస్యపూర్వక వాతావరణంలో పరిష్కరించవచ్చని, తద్వారా సంబంధిత పక్షాలకు సమయం, డబ్బు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. తమ వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలను కోరారు.

శ్రీమతి నాంపల్లి జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ (సెషన్స్ డివిజన్) కార్యదర్శి ఎ. శ్రీదేవి సమావేశానికి అధ్యక్షత వహించి, సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆమె లోక్ అదాలత్ ప్రాముఖ్యతను, ప్రజలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలను వివరించారు. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవ్వడమే కాకుండా, ఇరుపక్షాలకు సంతృప్తికరమైన ఫలితం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన వ్యక్తులు ఉచిత న్యాయ సహాయ సేవలను వినియోగించుకోవాలని కూడా ఆమె సూచించారు.

